బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 25 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4

# నేడు కేబినెట్ సమావేశం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర మంత్రి మండలి శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్లు, పారిశ్రామిక భద్రత, గిగ్ వర్కర్ల సంక్షేమం వంటి కీలక అంశాలపై చర్చించనుంది. ముఖ్యంగా మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీ. సుధర్శన్ రెడ్డి నేతృత్వంలో పనిచేసిన స్వతంత్ర నిపుణుల వర్కింగ్ గ్రూప్ సమర్పించిన 300 పేజీల నివేదికకు కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ఈ నివేదికలో రాష్ట్రంలోని 240కి పైగా బీసీ ఉపకులాలపై కుల గణాంకాల ఆధారంగా 'కాంపోజిట్ బ్యాక్వర్డ్‌నెస్ ఇండెక్స్ రూపొందించారు. ఈ సూచికను కేబినెట్ ఆమోదిస్తే, లక్ష్యిత సంక్షేమ కార్యక్రమాలకు దారి తీయనున్నది. జూలై 10న జరిగిన కేబినెట్ సమావేశంలో తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టంలో సవరణలకు ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలిపిన ప్రభుత్వం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియలో మొత్తం రిజర్వేషన్లు 70 శాతం కావడంతో సుప్రీంకోర్టు విధించిన 50 శాతం పరిమితిని అధిగమించిన విషయం తెలిసిందే. ఆర్డినెన్స్ గవర్నర్‌కు పంపినా ఇంకా ఆమోదం లభించలేదు.



# 6 పాక్ డ్రోన్లను కూల్చిన భారత్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పాకిస్థాన్ కుట్రలు ఆగడం లేదు. దేశ సరిహద్దుల్లో ఆయుధాలు, మత్తుపదార్థాలు దొంగ మార్గాల్లో పంపించేందుకు ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా పంజాబ్‌లోని అమృత్‌సర్ సమీపంలో ఆరు డ్రోన్ల ద్వారా అక్రమ సరుకులు పంపేందుకు పాక్ యత్నించింది. అయితే, ఈ కుట్రను భారత సరిహద్దు భద్రతా దళం భగ్నం చేసింది.

**ఒక్క రాత్రిలో ఐదు డ్రోన్లు కూల్చివేత**

బుధవారం రాత్రి భారత భూభాగంలో అనుమానాస్పద వస్తువులు కదలాడుతున్నట్లు గుర్తించిన బీఎస్ఎఫ్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. మోథే గ్రామ సమీపంలో ఐదు డ్రోన్లను కూల్చివేశారు. దాంతో పాటు మూడు తుపాకులు, మూడు మ్యాగజైన్లు, 1.07 కేజీల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

**ఇంకో డ్రోన్..**

అంతేకాదు, గురువారం తెల్లవారుజామున అట్టారీ దాల్ గ్రామానికి సమీపంలో మరో డ్రోన్‌ను కూల్చినట్లు బీఎస్ఎఫ్ అధికారులు తెలిపారు. పంటపొలాల్లో తుపాకీ విడిభాగాలు, ఓ మ్యాగజైన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఘటనతో పాక్ నుంచే డ్రగ్ మాఫియా, ఉగ్రవాద మూలాలు భారత భద్రతకు ముప్పుగా మారతున్నాయి అనే అంశం మరోసారి బయటపడింది. ఇటీవలి కాలంలో బీఎస్ఎఫ్ పంజాబ్‌లో డ్రోన్ ఉల్లంఘనలను తరచుగా ఎదుర్కొంటోంది. దేశ భద్రతను కాపాడటంలో బీఎస్ఎఫ్ మళ్లీ చాకచక్యతను చాటిచెప్పింది.

# కుల గణన, ఓబీసీలకు రిజర్వేషన్లు మా జాబ్

- దేశ ప్రజలకు మేలు చేసే ఈ సర్వేను బీజేపి ఎలాగు ఇష్టపడదు
- హిందూత్వం పేరుతో రాజకీయ విధ్వంసం చేస్తున్నారు
- కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ
- సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై ప్రజెంటేషన్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశంలో సామాజిక న్యాయానికి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన ఒక మైల్ స్టోన్ అని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. కులగణనను చాలా తేలికగా తన అంచనాలను మించి సీఎం, నిపుణుల కమిటీ పూర్తి చేసిందని చెప్పారు. కేవలం స్ఫూర్తితోనే కాకుండా, సమర్థవంతంగా తెలంగాణ ప్రభుత్వం ఈ సర్వేను నిర్వహించిందని ప్రశంసించారు. ఈ విషయాన్ని కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం అర్థం చేసుకోలేదని ఫైర్ అయ్యారు. త్వరలో దేశవ్యాప్తంగా నిర్వహించబోయే కులగణనను ఈ విధానంలో నిర్వహించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. "కులగణన అంత తేలికైన అంశం కాదు. తెలంగాణలో కులగణనకు ప్రోత్సహించినప్పుడు... సీఎం రేవంత్ రెడ్డికి ఈ అంశం కష్టమని భావించా. సీఎం సామాజిక వర్గం కూడా అందుకు అంగీకరించకపోయి ఉండవచ్చు. అందువల్ల చాలా జాగ్రత్తగా కులగణన అంశాన్ని సమీక్షించా' అని అన్నారు. గురువారం ఏఐసీసీ నూతన పార్టీ ఆఫీస్ ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ ఎంపీలకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్య సభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీలు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, తెలంగాణ ఎంపీలు మల్లు రవి, గడ్డం వంశీకృష్ణ, చామల, ఇతర ఎంపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ... తెలంగాణలో తలుపులు మూసిన పరిపాలన గదుల నుంచి కులగణన చేయలేదని చెప్పారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన లక్షలాది మంది తెలంగాణ ప్రజలు ఈ సర్వేలో పాల్గొనేందుకు తలుపులు తెరిచారన్నారు. ఆస్తులు, విద్యార్హతలు, సామాజిక వర్గం వంటి... మొత్తం 56 ప్రశ్నలతో కుటుంబంలోని ప్రతి వ్యక్తి సమాచారాన్ని సేకరించినట్టు చెప్పారు. కానీ విపక్షాలు మాత్రం సక్రమంగా కులగణన చేయలేదని విమర్శిస్తున్నాయని మండిపడ్డారు. అలాంటి వారందరీ కోసం మరోసారి అవకాశం కల్పిస్తామని, వారంతా ముందుకు రావాలని చురకలంటించారు.

1950, 60, 70వ దశకాల్లో పవర్ ఎక్కడి నుంచి వచ్చిందని ప్రపంచ దేశాలను ప్రశ్నిస్తే... ఆయిల్ అనే సమాధానం వచ్చేదని రాహుల్ అన్నారు. ఆ ఆయిల్‌నే ప్రజలు బ్లాక్ గోల్డ్‌గా పిలుస్తారన్నారు. 'ఏ దేశమైతే ఆయిల్‌ను కలిగి ఉందో... గ్లోబల్‌గా ఆ దేశమే ఆధిపత్యాన్ని కలిగి ఉండేది. ఇదే ప్రశ్నను ఈ రోజుల్లో అమెరికా అధ్యక్షులు డ్రోనాల్డ్ ట్రంప్, ప్రముఖ వ్యాపార వేత్త బిల్‌గేట్స్‌ను అడిగితే... ఈ కాలం ఆధిపత్యం డేటా(సమాచారం) అని చెబుతారు. అలాంటి 21 వ శతాబ్దానికి కావాల్సిన సోషల్, ఎకనామిక్, పొలిటికల్, ఫైనాన్షియల్ డేటా తెలంగాణ ప్రభుత్వం సొంతం. ఈ డేటాతో గ్రామీణా, జిల్లా స్థాయిల్లో సామాజిక, ఆర్థిక, ఎడ్యుకేషన్, హెల్త్... ఇలా ఏ సెక్టార్ల లో అయినా అభివద్ధి ఫలాలు అందించవచ్చు.' అని అన్నారు. ఇలాంటి టార్గెట్ డెవలప్మెంట్ అందించే అవకావం దేశంలోని ఇతర ఏ రాష్ట్రానికి లేదని గర్వంగా చెబుతున్నానన్నారు. ఇది ప్రస్తుత సమాజానికి కావాల్సిన సామాజిక, ఆర్థిక టూల్ అని చెప్పారు. అయితే సామాజిక, ఆర్థికం అంశంతో పాటు రాజకీయంగానూ దేశ ప్రజలకు మేలు చేసే ఈ సర్వేను బీజేపి ఎలాగు ఇష్టపడదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ విద్యా, ఉద్యోగాల్లో, పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోందన్నారు. కేవలం హిందూత్వం పేరుతో రాజకీయ విధ్వంసం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఈ విషయం బీజేపీ వాళ్లకు, తమపై పోరాడుతున్న ప్రతి కాంగ్రెస్

మిగితా 2వ పేజీలో

## దేశం కోసం త్యాగం చేసిన కాంగ్రెస్

### సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశం కోసం కాంగ్రెస్ పార్టీ మాత్రమే త్యాగాలు చేసిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం న్యూఢిల్లీలో కులగణనపై సీఎం రేవంత్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తెలంగాణ మోడల్ అంటే ఏమిటో తెలిపేందుకే ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్నట్లు తెలిపారు. భారత్ జోడో యాత్రలో కులగణనపై రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణలో అధికారంలోకి రాగానే కులగణన సర్వే చేశామన్నారు. దేశానికి ఒక దశా దిశను చూపించేలా ఈ కులగణన సర్వే చేపట్టామని ఆయన వివరించారు. దాదాపు వందేళ్ల తర్వాత కులగణన ప్రక్రియ నిర్వహించామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒత్తిడితోనే దేశవ్యాప్త కులగణనకు కేంద్రం దిగొచ్చిందని స్పష్టం చేశారు. పుట్టుకతో ప్రధాని నరేంద్ర మోదీ ఓబీసీ కాదని.. ఆయన లీగల్లీ కన్వర్టెడ్ ఓబీసీ అని అన్నారు. ఓబీసీల కోసం ప్రధాని మోదీ మనస్ఫూర్తిగా చేసిందేమీ లేదన్నారు.

కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీ తనను మెచ్చుకుంటూ లేఖ రాశారని, ఇది తనకు ఆస్కార్, నోబెల్ బహుమతి వంటిదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కులగణనను తెలంగాణ మోడల్ అని కాకుండా రేర్ మోడల్ అని కూడా అనవచ్చని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎవరూ కులగణన చేయలేదని, అందుకే రేర్ మోడల్ అనవచ్చని అభిప్రాయపడ్డారు. ఎన్ని అభివృద్ధి, సంక్షేమ పనులు చేసినప్పటికీ, సోనియా గాంధీ రాసిన లేఖనే తనకు గొప్ప అని వ్యాఖ్యానించారు.

మిగితా 2వ పేజీలో

# నాలుగో రోజూ అంతే...




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పార్లమెంట్ ఉభయ సభలలో గురువారం కూడా ఉద్రిక్తతలు కొనసాగాయి. బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలంటూ విపక్షాలు గట్టిగా నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగించాయి. లోక్‌సభ ప్రారంభమైన వెంటనే విపక్ష సభ్యులు ప్లకార్డులు చేతబట్టి ముందు వరుసలకెదిగి బలమైన నిరసనలు తెలిపారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తర్వాత సభ తిరిగి ప్రారంభమైనప్పుడు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణ ప్రసాద్ గోవా అసెంబ్లీలో ఎస్‌టీలకు రిజర్వేషన్ల బిల్లుపై చర్చ జరగాలని కోరినా, విపక్ష సభ్యులు ఆగలేదు.

న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ మాట్లాడుతూ, "ఎస్టీ జనాభా ప్రయోజనాల కోసం ఉద్దేశించిన బిల్లుపై చర్చకు అనుమతించకపోవడం దురదృష్టకరం" అని అన్నారు. అయినప్పటికీ నిరసనలు కొనసాగడంతో సభను శుక్రవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేశారు. సభలో ప్లకార్డులు ప్రదర్శించడం, నినాదాలు చేయడం పార్లమెంటరీ సాంప్రదాయాలకు విరుద్ధం అంటూ స్పీకర్ ఓం బిర్లా విపక్ష సభ్యులను పలుమార్లు హెచ్చరించారు.

**రాజ్యసభలో పరిస్థితి అదే**

రాజ్యసభలో కూడా అదే స్థితి. సర్ ప్రక్రియను ఉపసంహరించాలన్న డిమాండ్‌తో విపక్ష సభ్యులు నినాదాలకు దిగారు. మధ్యాహ్నం వాయిదా అనంతరం తిరిగి ప్రారంభమైన సభలో భువనేశ్వర్ కలిత అధ్యక్ష స్థానంలో ఉండగా సముద్ర మార్గ రవాణా బిల్లును చర్చకు ప్రవేశపెట్టారు. అయితే చర్చ కొనసాగుతుండగా విపక్ష సభ్యులు మాట్లాడుతున్న ఎంపీ సమీపానికి వెళ్లి నినాదాలు చేస్తూ గందరగోళాన్ని సృష్టించారు. చివరికి సభ శుక్రవారానికి వాయిదా పడింది.

పార్లమెంట్ బయట కూడా విపక్ష సభ్యులు ప్లకార్డులతో సర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఐక్యవిపక్షం దీన్ని ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణిస్తోంది.

# భారత్-యూకే మధ్య చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం



**రక్షణ, టెక్నాలజీ, శుద్ధ ఇంధన రంగాల్లో సంబంధాల విస్తరణకు 'విజన్ 2035' ప్రకటన**

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

భారత్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, యునైటెడ్ కింగ్‌డమ్ ప్రధాని కీర్ స్టార్మర్ గురువారం కీలక వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో రెండు దేశాల మధ్య వాణిజ్యం గణనీయంగా పెరిగే అవకాశం ఉండగా, కార్లు, వస్త్రాలు, విస్కీతో పాటు అనేక ఉత్పత్తులపై టారిఫ్‌లు తొలగించనున్నారు. ఈ సమావేశం బ్రిటిష్ ప్రధానమంత్రి అధికార నివాసమైన చెకర్స్ లో జరిగింది. సమావేశ అనంతరం, రెండు దేశాలు 'విజన్ 2035' పేరిట రక్షణ, సాంకేతికత, శుద్ధ ఇంధనం, వలసల వంటి రంగాల్లో సంబంధాలను విస్తరించేందుకు సమష్టి కార్యాచరణ రూపకల్పన చేశాయి.

**రక్షణ రంగానికి ఓ సరికొత్త దిశ**

రక్షణ రంగంలో సహ ఉత్పత్తి, సహ అభివృద్ధికి సంబంధించి డిఫెన్స్ ఇండస్ట్రియల్ రోడ్‌మ్యాప్ ను ఇరు దేశాలు విడుదల చేశాయి. కీలక రక్షణ పరికరాలు, ప్లాట్‌ఫామ్స్‌పై కలసి పని చేయనున్నారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ, బ్రిటన్ రాజు చార్లెస్ III ను నార్ఫోక్ లోని సాండ్‌రింగ్హామ్ ఎస్టేట్‌లో కలుసుకున్నారు. తమ పర్యావరణ నూతన ఉద్యమం "ఒక చెట్టు తల్లిపేరుతో" భాగంగా రాజుకు చెట్టు మొక్కను బహూకరించారు. యూకే పర్యటన ముగించుకున్న మోదీ, తన ద్విదేశీయ పర్యటనలో రెండో దశ కోసం మాల్దీవులకు బయలుదేరారు.



# నిండునూరేళ్లు వర్ధిల్లు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తన తనయుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పార్టీ అధినేత కేసీఆర్ ఆశీర్వదించారు. గురువారం తన పుట్టినరోజును పురస్కరించుకొని కేటీఆర్ తన సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షుతో కలిసి ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులైన కేసీఆర్, శోభమ్మకు కేటీఆర్, శైలిమ పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా నిండునూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ కేటీఆర్, శైలిమను కేసీఆర్ దంపతులు ఆశీర్వదించారు.

# కూలిన రష్యన్ విమానం.. 49 మంది మృతి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

49 మంది ప్రయాణికులతో సోమవారం బయలుదేరిన రష్యన్ విమానం చైనా సరిహద్దుకు దగ్గరలో రష్యా తూర్పు ప్రాంతంలో కూలిపోయింది. ప్రయాణికులు అంతా మరణించారు. రష్యాలో సోమవారం అదృశ్యమైన అంగారా ఎయిర్ లైన్స్ ప్యాసింజర్ విమానం ప్రమాదానికి లోనయిందని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. విమానంలో ఐదుగురు చిన్నారులతో సహా 43 మంది ప్రయాణికులు, ఆరుగురు క్రూ మెంబర్స్ ఉన్నారు. రష్యా ఫార్ ఈస్టర్న్ అమురు ప్రాంతంలోని టిండా సమీపంలో విమానం కూలిపోయింది.

సోమవారం అర్ధరాత్రి నుంచి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు విమానంతో సంబంధాలు కోల్పోయారు. టిండా పట్టణంలో విమానం ల్యాండింగ్ సమయంలో పైలట్ తప్పిదం ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమిక నివేదికలు చెబుతున్నాయి. ప్రమాదం జరిగిన కొద్ది సమయంలోనే రిస్క్యూ టీమ్ మండిపోతున్న విమానం శకలాలను



చూసింది. ఈ విమానం దాదాపు 50 ఏళ్లక్రితం సోవియెట్ యూనియన్ శకంలో 1976 లో నిర్మించినది. సైబీరియాకు చెందిన అంగారా ఎయిర్ లైన్స్ నడుపుతున్న ఆంటోనోవ్ ఏఎన్ -24 విమానం టిండా విమానాశ్రయంలో మొదట ల్యాండింగ్ కు ప్రయత్నించి విఫలమైంది. రెండో సారి ల్యాండింగ్ చేస్తుండగా రాడార్ నుంచి కన్పించకుండా పోయింది. తర్వాత కుప్పకూలింది.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లాల కలెక్టర్‌లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి సీఎంవో అధికారులతో మాట్లాడారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని, లోతట్టు ప్రాంతాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నందున చెరువులు, కుంటలు నిండి వరద నీటి ఉధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. భారీ వర్ష సూచన ఉన్న జిల్లాల్లో కలెక్టర్లు అన్ని విభాగాలతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని చెప్పారు.

ఎక్కడ కూడా ఆస్తి, ప్రాణ నష్టం జరక్కుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షాలు, వరదలతో ఎటువంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు, ఎలాంటి సహాయమైనా అందించేందుకు అధికారులు జిల్లాల్లోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లతో పరిస్థితిని సమీక్షించాలని సూచించారు.

# నేటి నుంచి ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్

- రేపు ధ్రువపత్రాల పరిశీలన

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ప్రాసెసింగ్ ఫీజు చెల్లించడానికి అవకాశముందనీ, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 26న ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 26,27 తేదీల్లో వెబ్‌ఆప్షన్ల నమోదు చేసేందుకు అవకాశముందని వివరించారు. ఈనెల 30న ఎప్‌సెట్ రెండోవిడత ప్రవేశాలకు సంబంధించిన సీట్లను కేటాయిస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. రాష్ట్రంలో 172 ఇంజినీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 83,054 సీట్లున్నాయి. ఎప్‌సెట్ మొదటి విడతలో 77,561 మందికి సీట్లు కేటాయించారు. అందులో 59,980 మంది సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. ఎప్‌సెట్ రెండో విడతలో 23,074 సీట్లు అభ్యర్థులకు అందుబాటులో ఉన్నాయి.

# నేటి నుంచి దోస్త్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీసీఏ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభం కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఛైర్మెన్, దోస్త్ కన్వీనర్ వి బాలకిష్టారెడ్డి, కళాశాల విద్యాశాఖ కమి షనర్ శ్రీదేవసేన గురువారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. దోస్త్ ప్రత్యేక విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ శుక్రవారం నుంచి ఈ నెల 31 వరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశముందని తెలిపారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.400 చెల్లించాలని కోరారు. శుక్రవారం నుంచి ఈనెల 31 వరకు విద్యార్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని సూచించారు. ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 31న విశ్వవిద్యా లయాల్లోని హెల్ప్‌లైన్ కేంద్రాల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. వచ్చేనెల మూడో తేదీన దోస్త్ ప్రత్యేక విడత సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. అదేనెల మూడు నుంచి ఆరు వరకు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. వచ్చేనెల నాలుగు నుంచి ఆరు వరకు కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. అదేనెల 11, 12 తేదీల్లో ప్రయివేటు, ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లను నిర్వహించాలని తెలిపారు. స్థానికులు, స్థానికేతరులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లలో సీట్లు పొందిన విద్యార్థుఉ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులు కాదని స్పష్టం చేశారు. ఇతర వివరాల కోసం https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

# కొనసాగుతున్న వర్షాలు



# పెట్టుబడులకు తెలంగాణ హబ్‌గా మారుతోంది

● **మంత్రి శ్రీధర్‌బాబు**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ 18 నెలల్లో రూ.3.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. గురువారం హెచ్‌ఐసీసీ వేదికగా యూఏఈ%-%తెలంగాణ సంయుక్తంగా నిర్వహించిన 'ఇన్వెస్టోపియా గ్లోబల్' అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ దృష్టి అని, ఈ దిశగా పెట్టుబడులు, భాగస్వామ్యాలు కీలకమని మంత్రి తెలిపారు. "తెలంగాణ చిన్న భౌగోళిక పరిమాణం గల రాష్ట్రంగా కనిపించినా, ఆశయాలు, అభివృద్ధి పరంగా దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది," అని పేర్కొన్నారు.

2024-25లో తెలంగాణ జీఎస్‌డీపీలో 8.2% వృద్ధి నమోదైందని, ఇది జాతీయ సగటు 7.6% కంటే ఎక్కువగా ఉందని మంత్రి వివరించారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5



శాతానికి పైగా ఉందని తెలిపారు.

డ్రై పోర్ట్‌లు, మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్ల విస్తరణతో పాటు నెట్-జీరో పారిశ్రామిక పార్కులు, ఈవీ జోన్‌లు, గ్రీన్ లాజిస్టిక్స్ హబ్‌లు, ఆర్ఆర్ఆర్, మెట్రో ఫేజ్%-%2 వంటి ప్రాజెక్టులతో రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు చెప్పారు.

ఫ్యూచర్ సిటీని ఫిన్‌టెక్, క్లైమేట్ టెక్, స్మార్ట్ మొబిలిటీ వంటి రంగాల్లో గ్లోబల్ కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. డేటా సెంటర్లు, జీసీసీ, ఏఐ ల్యాబ్‌లు, ఏరోస్పేస్ క్లస్టర్లలో వేగంగా అభివృద్ధి జరుగుతోందని వివరించారు.

యూఏఈకి తెలంగాణ ఎగుమతులు గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2.5 రెట్లు పెరిగాయని, ఫార్మా, ఏరోస్పేస్, డిజిటల్ సేవలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో వాటి పాత్ర ఎక్కువగా ఉందని తెలిపారు. ఇప్పటికే లులూ గ్రూప్, డీపీ వరల్డ్, నాఫ్కో లాంటి యూఏఈ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాయని వెల్లడించారు.

"ఇది కేవలం పెట్టుబడి సదస్సు మాత్రమే కాదు.. ఇది పాత స్నేహితుల కలయిక, భవిష్యత్తుకు లాంఛనంగా మారనుంది," అని మంత్రి అన్నారు. తెలంగాణలో లైఫ్ సైన్సెస్, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వాహనాలు, డిఫెన్స్ తయారీ, ట్రేడ్ ఇన్‌ఫ్రా, టూరిజం, మెడికల్ తదితర రంగాల్లో పెట్టుబడి అవకాశాలున్నాయని చెప్పారు. యూఏఈ పారిశ్రామికవేత్తలను రాష్ట్రంలో పెట్టుబడులకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో యూఏఈ మినిస్టర్ అబ్దుల్లా బిన్ తాక్ అల్ మర్రి, రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, యూఏఈ మినిస్ట్రీ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండర్‌సెక్రటరీ మహ్మద్ అల్ వాహీ, ఇన్వెస్టోపియా సీఈవో డా. జీన్ ఫారెస్ తదితరులు పాల్గొన్నారు.

# "భారతీయులను నియమించకండి..

● **అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**

**బలగం టీవీ, హైదరాబాద్**



భారతీయుల సహా పరాయిదేశాల ఉద్యోగులను నియమించుకోవడం ఇకపై ఆపేయా లని, అమెరికా టెక్నాలజీ సంస్థలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంగా సూచించారు. బుధవారం వాషింగ్టన్‌లో జరిగిన ఒక ఏఐ సదస్సులో ఆయన మాట్లాడారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రముఖ టెక్ కంపెనీలను ఉద్దేశించి ట్రంప్ మాట్లాడుతూ... "ఇకపై కంపెనీలు అమెరికన్లపై దృష్టి పెట్టాలి. చైనాలో పరిశ్రమలు, భారతీయుల కోసం ఉద్యోగాలు... ఇవన్నీ ఆగాలి. స్వదేశంలోనే ఉపాధి అవకాశాలు పెంచే దిశగా పనిచేయాలి" అని స్పష్టం చేశారు.

అమెరికన్ కంపెనీలు విదేశాల్లో పెట్టుబడులు పెట్టడాన్ని ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. "ఆ సంస్థలు అమెరికా ఇచ్చిన స్వేచ్ఛను ఉపయోగించుకొని లాభాలు ఆర్జిస్తున్నాయి. కానీ ఆ డబ్బును విదేశాల్లో పెట్టుబడులుగా మళ్లిస్తున్నాయి. ట్రంప్ పాలనలో ఈ పరిస్థితి ఇక ఆగాల్సిందే" అని హెచ్చరించారు.

"ఏఐ పోటీలో దేశభక్తి కీలకం"

ఏఐ రంగంలో అమెరికా విజయవంతం కావాలంటే టెక్ రంగంలో 'సరికొత్త దేశభక్తి' అవసరమని ట్రంప్ అన్నారు. సిలికాన్ వ్యాలీ కంపెనీలు మొదట అమెరికాకే ప్రాధాన్యం ఇవ్వాలని, విదేశీ ఉద్యోగ నియామకాలకు వ్యతిరేకంగా ఉన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏఐ రంగానికి సంబంధించిన మూడు కీలక ఆదేశాలపై ట్రంప్ సంతకం చేశారు.

# కుల గణన, ఓబీసీలకు రిజర్వేషన్లు మా జాబ్

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తకు తెలుసునన్నారు.

దేశ అభివృద్ధికి డబ్బు, భూమలు కాదని... ఇంగ్లీష్ ఎడ్యూకేషన్ ఒక్కటే ఏకైక మార్గమని రాహుల్ అన్నారు. ఈ విషయం తెలంగాణ కుల గణనలో స్పష్టంగా వెల్లడైందని చెప్పారు. 'ఇంగ్లీష్ అత్యంత పవర్ ఫుల్. ఈ సర్వేకు ముందు భూములే విలువైనవని నేను భావించే వాణ్ని. కానీ ఇంగ్లీష్ ప్రాధాన్యమైన అంశంపై కుల గణన ఎక్స్‌పర్ట్స్ కమిటీ చెప్పినప్పుడు ఆశ్చర్యం కలిగింది. ప్రస్తుతం ప్రాంతీయ భాషలు, హిందీ ఉన్నప్పటికీ... ఇంగ్లీష్ అవసరం. అలా అని హిందీ, ప్రాంతీయ భాషలు అక్కర్లేదని తాను చెప్పడం లేదు' అని క్లారిటీ ఇచ్చారు. హిందీ, తమిళ్, కన్నడ ఇలా ఏ ప్రాంతీయ భాష తీసుకున్నా... దాని తర్వాత ఇంగ్లీష్‌ను తప్పక బోధించాలన్నారు. ఈ విషయంలో ఏ బీజేపీ నేత దగ్గరకి పోయి అడిగినా... ఇంగ్లీష్ వద్దంటారు. అయితే ఏ స్కూల్, కాలేజీలో మీ పిల్లలు చదువుతున్నారు అని బీజేపీ నేతల్ని నిలదీయండి. ఆన్సర్ తప్పకుండా ఇంగ్లీష్ మీడియం అని వస్తుంది.' అని చెప్పారు. మరి ఆ అవకాశాన్ని దేశంలోని వెనకబడిన వర్గాలైన ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఎందుకు ఇవ్వరని బీజేపి నేతల్ని ప్రశ్నించారు.

కుల గణన, ఓబీసీలకు రిజర్వేషన్లు తనకు, సీఎం రేవంత్ రెడ్డికి జాబ్ అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఆ డేటాతో తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పులు తేవాలనుకుంటున్నట్టు చెప్పారు. అలాగే దేశ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని తాను నిరతంతరం ఆలోచిస్తున్నట్టు చెప్పారు. కానీ ఈ ఆలోచనను బీజేపీ అడ్డుకోవాలని చూస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యా, ఉద్యోగాలు, లోకల్ బాడీ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ల క్యాప్‌ను తొలగించేలా అసెంబ్లీలో బిల్ పాస్ చేసి కేంద్రానికి పంపిందన్నారు. కానీ దీన్ని బీజేపీ అడ్డుకుంటోందని ఆరోపించారు. ప్రస్తుతం సీఎం మద్దతు తో ఈ అంశంపై పార్లమెంట్ వేదికగా పోరాడడమే ప్రస్తుతం తన ముందు ఉన్న ముఖ్యమైన జాబ్ అని రాహుల్ స్పష్టం చేశారు. దేశంలోని ఓబీసీల ఆంకాంక్షలు, కోరికలు నెరవేర్చేందుకు బీజేపీ తమతో కలిసి రావాలని హితవు పలికారు. ఈ దిశలో 50 శాతం రిజర్వేషన్ల పరిమితి గోడను కూల్చాల్సిన అవసరం ఉందన్నారు.

రాష్ట్రం కులగణనను విజయవంతంగా నిర్వహించి దేశానికే దిశానిర్దేశం చేసిందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. కులగణన చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డిది నిజంగా సాహసోపేతమైన చర్యని అభివర్ణించారు. ఈ సర్వే సందర్భంగా కొన్ని వర్గాల నుంచి ప్రతిఘటన ఎదురై ఉండవచ్చని చెప్పారు. కుల గణన పై ఇందిరా భవన్‌లో ప్రజెంటేషన్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వెనుకబడిన వర్గాలు, ఎస్సీలు, మైనారిటీల మధ్య ఐక్యతకు పిలుపునిచ్చారు. ఈ వర్గాలు సామాజికంగా, రాజకీయంగా కలిసి వచ్చి కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చిన తర్వాతే... దేశవ్యాప్తంగా పార్టీకి 70 శాతం కంటే ఎక్కువ మద్దతు లభించిందన్నారు. అలాగే 'భారత్ జోడో యాత్ర' లో ఇచ్చిన మాటకు కట్టుబడి... తెలంగాణలో కుల గణనను ప్రోత్సహించిన లోక్ సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీని ప్రత్యేకంగా ప్రశంసించారు. కులగణన అంశాన్ని లేవనెత్తడమే కాక, 'జై బాపు, జై భీమ్, జై సంవిదాన్'నినాదంతో రాజ్యాంగాన్ని కాపాడటానికి రాహూల్ కారణమని అన్నారు. గాంధీ ఒత్తిడి కారణంగానే ప్రధాని మోడీ దేశ వ్యాప్త జన గణనలో కుల గణనను చేస్తామని దిగిరాక తప్పలేదన్నారు.

# బండి సంజయ్, ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు నాన్‌బెయిలబుల్ వారెంట్

**బలగం టీవీ, హైదరాబాద్**

కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. హుజూరాబాద్ ఎన్నికల ప్రచారానికి సంబంధించి నమోదైన కేసులో కోర్టు ఎదుట హాజరు కావాలని ఎన్నిసార్లు నోటీసులు పంపినా బండి సంజయ్ హాజరు కాకపోవడంతో కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ఉన్నందున వ్యక్తిగత హాజరుకు మరికొంత సమయం కావాలని కొరుతూ బండి సంజయ్ న్యాయవాది రీకాల్ పిటిషన్ దాఖలు చేయడంతో పాటు ఈ నెల 30వ తేదీన హాజరైయ్యేందుకు అనుమతి కోరనున్నారు. మరోక కేసులో రాష్ట్ర మంత్రికి సైతం నాన్‌బెయిలబుల్ వారెంట్ జారి అయింది. రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై ఎన్నికల సందర్భంగా నేరేడుచర్ల పోలీస్ స్టేషన్లలో కేసు నమోదైంది. ఈ కేసు విచారణకు మంత్రి ఉత్తమ్ గైర్హాజరు కావడంతో నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కాగా, ఇప్పటికే ఈ కేసును కొట్టివేయాలంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

# దేశం కోసం త్యాగం చేసిన కాంగ్రెస్

**సీఎం రేవంత్ రెడ్డి**

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ గాంధీ మనసులో అనుకున్న పనులను తాను చేయాలని సంకల్పించానని రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన అనుకున్నవన్నీ తాను చేశానని, అందుకే ఇప్పుడు కులగణన విషయంలో తెలంగాణ మోడల్ గురించి దేశమంతా చర్చ జరుగుతోందని ముఖ్యమంత్రి అన్నారు. రాహుల్ గాంధీ ఏమైనా చెప్పారంటే అది తనకు బంగారు గీత అని స్పష్టం చేశారు.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కులగణన చేస్తామని పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాహుల్ హామీ మేరకు రాష్ట్రంలో కులగణన చేపట్టామని వివరించారు. అందుకు తగ్గట్లుగా ఎవరి జనాభా ఎంత అనేది తేల్చామన్నారు. తెలంగాణలో కుల గణన ఓ చరిత్ర అని ఆయన అభివర్ణించారు. కుల గణనతో దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. దాదాపు 2 లక్షల మంది సిబ్బందితో 50 రోజుల్లో ఈ సర్వే నిర్వహించామని వివరించారు. తెలంగాణ మొత్తాన్ని బ్లాక్‌లుగా విభజించి సర్వే నిర్వహించామని చెప్పారు.ఎలాంటి పొరపాట్లు లేకుండా కుల గణన సర్వే చేపట్టామని తెలిపారు. 150 ఇళ్లకు ఒక్కో ఎన్యూమరేటర్‌ను నియమించి ఈ సర్వే చేపట్టామని పేర్కొన్నారు. విస్తృత సంప్రదింపులతో కుల గణన సర్వే సాకారం చేశామన్నారు. కుల గణన సర్వేను తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిందని చెప్పారు. అసెంబ్లీ అనుమతితో రిపోర్ట్‌పై నిపుణుల కమిటీ సైతం వేశామని చెప్పారు. నిపుణుల కమిటీ కొన్ని కీలక సూచనలు చేసిందన్నారు. ఈ కమిటీ సూచనలపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు.

# సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల స్వాప్, పరస్పర బదిలీలకు ఉత్తర్వులు

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల స్పౌజ్, పరస్పర బదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఈ నవీన్ నికోలస్ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ (యూఆర్ఎస్)తోపాటు సమగ్ర శిక్షలో 2025-26 విద్యాసంవత్సరంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల స్పౌజ్, పరస్పర బదిలీలు చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. స్పౌజ్, పరస్పర బదిలీలకు అర్హులైన ఉద్యోగులకే బదిలీలుంటాయని స్పష్టం చేశారు. ఈనెల 26 నాటికి దరఖాస్తులను సమగ్ర శిక్ష కార్యాలయానికి సమర్పించాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులు స్పౌజ్ లేదా పరస్పర బదిలీల్లో ఒక్క దానికే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల స్థానచలనానికి సంబంధించి చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారులు (డీఈవో), సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారుల (డీపీవో)ను ఆదేశించారు.

# మల్లారెడ్డి ఇంట్లో ఐటీ సోదాలు అవాస్తవం

● **మల్లారెడ్డి విశ్వవిద్యా పీఠ్ వైస్ చైర్ పర్సన్, మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆయన కుమారుడు భద్రారెడ్డి ఇండ్లల్లో ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారని వచ్చిన వార్తలను మల్లారెడ్డి విశ్వవిద్యా పీఠ్ వైస్ చైర్ పర్సన్, మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి ఖండించారు. ఈ మేరకు గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. 2022 లో కాళోజీ రావు యూనివర్సిటీ పీజీ సీట్ల విషయంలో తమ కళాశాలపై వేసిన కేసు విషయంలో వరంగల్ పోలీసులు వచ్చి విచారణలో భాగంగా నోటీస్ ఇచ్చారని తెలిపారు. ఉదయం 6 గంటలకు పోలీసులు రావడంతో ఐటీ అధికారులు వచ్చినట్టు ప్రచారం జరిగిందన్నారు. కానీ అది అవాస్తవమన్నారు. తమ యూనివర్సిటీలో అడ్మిషన్స్ అన్ని సక్రమంగా జరిగాయని, ఎప్పుడూ విద్యార్థుల విషయంలో అవకతవకలు జరగకుండా చూడటంలో మల్లారెడ్డి యూనివర్సిటీ జాగ్రత్తలు తీసుకుంటుందని ఆమె తెలిపారు.

# జువైనల్ హెూం నుంచి ఐదుగురు బాలురులు పరారీ

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ సైదాబాద్ పరిధిలోని జువైనల్ హెూం నుంచి ఐదుగురు బాలురులు పరారయ్యారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకెళ్తే.. ఈ నెల 22న మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో జువైనల్ హెూం నుంచి ఐదుగురు బాలురు గోడ దూకి తప్పించుకున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు హెూం అధికారులు సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పిల్లల కోసం గాలింపు చేపట్టారు. ఈ విషయంపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# కోడిగుడ్ల సరఫరా టెండర్ల పర్యవేక్షణకు కమిటీ..

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టల్స్, అంగన్వాడీ కేంద్రాలలో ఏడాదిపాటు కోడి గుడ్ల సరఫరా టెండర్ల పర్యవేక్షణకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. గురువారం కోడిగుడ్ల సరఫరా టెండర్ల పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ

జిల్లా కలెక్టర్ చైర్మెన్ గా, జిల్లా విద్యాధికారి, ఆయా రెసిడెన్షియల్ విద్యాలయాలు బాధ్యులు, పశుసంవర్ధక శాఖ అధికారులు సభ్యులుగా ఈ కమిటీ లో ఉంటారని అన్నారు. ప్రభుత్వ వసతి గృహాల నుండి కోడిగుడ్డుల ఇండెంట్



వివరాలు జిల్లా కలెక్టరేట్ కు సమర్పించాలని జిల్లా అడ్మినిస్ట్రేషన్ నుండి నేరుగా సప్లయర్ కు అవసరమైన కోడిగుడ్ల ఇండెంట్ ను సమర్పిం చడం జరుగుతుందని, గత సంవత్సరం అడ్మిషన్లకు అదనముగా 10% విద్యార్థుల సంఖ్యను పెంచి ఇండెంట్ తయారు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు కోడిగుడ్డు బరువు 45 గ్రాముల నుంచి 52 గ్రాములు ఉండాలని, ప్రతి మాసము రెండుసార్లు సప్లై చేయాలని, అర్హత, అనుభవం వారికి నిబంధనల ప్రకారం కోడిగుడ్లు సరఫరా చేసే హక్కులు అందజేస్తామని, కోడిగుడ్ల సరఫరాలో ఆలస్యం చేస్తే పెనాల్టీలు విధిస్తామని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్ రావు, ఆయా విద్యాలయాల కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా పోస్టులపై జిల్లా పోలీసుల ప్రత్యేక నిఘా

**- అసత్య ప్రచారాలు ఫార్వర్డ్ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.**

**- ఎస్పీ మహేష్ బి.గితే**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సామాజిక మాధ్యమాల్లో మతవిద్వేషాలు రెచ్చగొట్టేల,ఒక వర్గాన్ని,పార్టీని టార్గెట్ గా చేసుకొని పోస్టులు పెట్టెవారిపై,శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టే వారిపై,వాస్తవాలను తెలుసుకోకుండా అసత్య ప్రచారాలు ఫార్వర్డ్ చేస్తే, ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా పోస్టులు పెట్టె వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీమహేష్ బి.గితే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజికమధ్యమల్లో వచ్చే పోస్టులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిజ నిజాలు తెలుసుకోకుండా ఎట్టి పరిస్థితుల్లో అట్టి మెసేజ్లను ఫార్వర్డ్ చేయకూడదని అన్నారు.సోషల్ మీడియా పోస్టులపై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సోషల్ మీడియా ట్రాకింగ్ విభాగం ప్రతి పోస్టును నిశితంగా పరిశీలించడం జరుగుతుందని అన్నారు.జిల్లాలో సోషల్ మీడియా విభాగం ద్వారా సోషల్ మీడియా పోస్టులపై 24l7 నిరంతరం పోలీస్ నిఘా ఉంటుందని ఈసందర్భంగా హెచ్చరించారు.

సామాజిక మధ్యమల్లో మతవిద్వేషాలు,ఒక వర్గాన్ని,పార్టీని టార్గెట్ గా,శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులపై,వాస్తవాలను తెలుసుకోకుండా అసత్య ప్రచారాలు ఫార్వర్డ్ చేసే వారి సమాచారం సోషల్ మీడియా ట్రాకింగ్ సెల్ 8712537826 నంబర్ కి మెసేజ్ రూపంలో తెలుపాలని అన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇటీవల రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ మైనార్టీ,వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి మండలం జైన పర్యటనకు వెళ్ళిన సందర్భంగా కోడూరు నరేష్,కోడూరు సుధాకర్ అనే ఇద్దరు దివ్యాంగులు ట్రైసైకిల్స్ లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని మంత్రిని కలిసి వివరించారు. వెంటనే ఆయన స్పందించి జిల్లా అధికారులతో మాట్లాడి రెండు ట్రైసైకిల్స్ ను మంజూరు చేయించి అట్టి ట్రైసైకిల్ను అందిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఇచ్చిన హామీ మేరకు గురువారం జైనలో సుధాకర్,నరేష్ లకు అట్టి ట్రైసైకిల్స్ ను మంత్రి అందజేసారు. మంత్రి సహాయాన్ని అందుకున్న నరేష్,సుధాకర్ తోపాటు వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## గురుకుల విద్యాలయాన్ని మంత్రి ఆకస్మిక తనిఖీ



**బలగం టీవీ, పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని మల్లాపూర్ లోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయంలో మౌలిక వసతులు గురించి అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన వసతుల గురించి తెలుసుకోవడానికి డైనింగ్ హాల్ ను ఆయన సందర్శించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులతో మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడారు. పాఠశాలలో వసతులు, భోజనం,టాయిలెట్లు వంటి తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డైట్ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, భోజన నాణ్యతగా ఉండాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఎక్కడ రాజీ పడవద్దు అని ఆయన సూచించారు. పాఠశాలలో నీటి సమస్య ఉందని బోధన సిబ్బంది ఆయన దృష్టికి తీసుకురాగా బోర్వెల్ వేయిస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.

ప్రస్తుత వర్షాకాలంలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున నెలలో రెండుసార్లు వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది అని జరిగిందని లక్ష్మణ్ కుమార్ ఈ సందర్భంగా వివరించారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్యను అనుసరించి డైనింగ్ హాల్ సౌలభ్యంగా లేదని బోధన సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లగా వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తానని పరిష్కరిస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.



## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**బలగం టీవీ, బోయినిపల్లి**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలసి, కట్ చేసి,అనంతరం పూలపండ్ల మొక్కలను నాటి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ కేటీఆర్ హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలో ఓ గొప్ప నగరంగా తీర్చిదిద్దారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అనేక ఐటీ పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడంలో ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు.యువనేత నడవడిక, నాయకత్వ పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నాగయ్య, సింగిల్ విండో చైర్మన్ తీపిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ మండల కో–ఆప్షన్ సభ్యులు మహ్మద్ ఆజ్జు, నాయకులు గుంటి శంకర్, నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, అంజన్ రావు, మల్లారెడ్డి, కమల్ గౌడ్, కోటి, కన్నం సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎందుకనో..?

**బలగం టీవీ, ఆలేరు**

క్షుద్బాధతో భిక్షాందేహి అని చేయి చాపితే ఛీదరించుకుంటున్నారు

దొంగ బాబాలు చేయిచాపి చాపకముందే కోట్లు కుమ్మరిస్తారు ?

తినేందుకు ఏమిలేక ఆకలై అడిగితే అది ముష్టేనట?

బడా బాబులు అడిగితే అది భక్తేనట?

కొబ్బరి కాయలు, పూలదండలు అమ్మేవాళ్ళ వద్ద గీచిగీచి బేరాలాడుతుంటారు.!

దేవుడి హుండీలో దక్షిణ పూజ టిక్కెట్ వద్ద బేరసారాలు గుర్తుకురావంటారు !

విలాసవంతమైన సూపర్ మార్కెట్లో సరకులు కొని మారు మాట్లాడకుండా బిల్లు కట్టుతారు .

చిన్న చితక కిరాణా కొట్టులో గీచిగీచి బేరం ఆడి సరకులు కొని బిల్లు కట్టుతారు.ఎందుకనో? ఈ వ్యవస్థ మారాలని కోరుకుంటూ



**రచన: మంజుల పత్తిపాటి**
**మాజీ డైరెక్టర్ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ, యాదాద్రి భువనగిరి జిల్లా**

## జీపీవో, లైసెన్స్ సర్వేయర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిచాలి

**- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**బలగం టీవీ, పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లాలో ఈనెల 27న జరిగే జీపీవో, లైసెన్స్ సర్వేయర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్లో జీపీవో, లైసెన్స్ సర్వేయర్ పరీక్షల నిర్వహణపై అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి కలెక్టర్ గురువారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. మంథని జేఎన్టీయూ కళాశాలలో లైసెన్స్ సర్వేయర్ పరీక్ష, పెద్దపల్లి (పెద్దకల్వల) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీపీవో పరీక్ష ఆదివారం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సర్వే ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాసులు, పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ రాజయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ల పై కక్ష సాధింపు సరికాదు..

**- బహుజన సమాజ్ పార్టీ వీర్నపల్లి మండల అధ్యక్షులు గజ్జెల ప్రశాంత్**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం అయిన జర్నలిజం, జర్నలిస్ట్లపై కక్షసాధింపు చర్యలు సరి కాదు అని బహుజన సమాజ్ పార్టీ వీర్నపల్లి మండల అధ్యక్షులు గజ్జెల ప్రశాంత్ డిమాండ్ చేశారు. ప్రజలకు ఏం కావాలో మొట్ట మొదట తెలిసేది జర్నలిస్టులకే నని ప్రభుత్వానికి కాదని అన్నారు. అటు ప్రజలను ఇటు ప్రభుత్వాలకు కలిపే అనుసంధాన కర్తలే విలేకరులు అని అన్నారు. ఇటీవలే ఓ ప్రధాన పత్రికా విలేకరి మీద సామాజిక మాధ్యమాల్లో వ్యక్తి గత కుటుంబం మీద జరుగుతున్న దాడులు సరి కాదు అని హితవు పలికారు. ఎన్నో ఏళ్లుగా చదువుకు దూరమైన దళిత బహుజన సమాజం ఇప్పుడిప్పుడే విజ్ఞానవంతులై జర్నలిస్ట్ గా రాణిస్తున్నా బహుజన బిడ్డల మీద అధికారం ఉందని అక్కసు వెళ్లగక్కడం, అధికారులను ఉసిగొల్పుతూ వ్యక్తి గత స్వేచ్ఛను హరించడం సబబు కాదు అని అన్నారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని ఎవరు తప్పు చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. అధికారం అడ్డుపెట్టుకొని కుట్రలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు అని అన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు అని హుందాగా వ్యవహరించాలి అని కోరారు. ప్రభుత్వ తప్పిదాలను రాయడమే, ఎత్తిచూపడమే నేరమా ? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా దళిత, బహుజన జర్నలిస్ట్ లపై జరిగే దాడులను అరికట్టాలని లేని పక్షంలో బహుజన సమాజ్ పార్టీ అండగా ఉండి పోరాడుతుంది అని హెచ్చరించారు.

## గాంధీ భవన్లో ప్రజా సంక్షేమ కార్యక్రమం..

**ప్రజలతో నేరుగా ముఖాముఖి నిర్వహించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు గాంధీ భవన్లో ఒక్క రోజు ప్రజలతో ముఖాముఖి అందుబాటులో ఉండేలా నూతన ఒరవడిని ప్రారంభించారు. ఈ కార్యక్రమం హైదరాబాద్లోని గాంధీ భవన్లో గురువారం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇందులో పాల్గొన్నారు. ప్రజల నుంచి పలు సమస్యలపై విజ్ఞప్తులను, అర్జీలను ఆయన స్వయంగా స్వీకరించారు. అనంతరం, వాటిని సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి తక్షణ పరిష్కారానికి కృషి చేశారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు మరింత చేరువయ్యేలా, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే దిశగా టీపీసీసీ చేపట్టిన ఈ చొరవకు ప్రజల నుండి మంచి స్పందన లభించింది. భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

# ఫైనల్‌కు కోనేరు హంపి

- ఫిడే మహిళల చెస్ వరల్డ్‌కప్ 2025 ఫైనల్లోకి ప్రవేశించిన

**రెండో భారత గ్రాండ్‌మాస్టర్**



**బలగం టీవీ, న్యూఢిల్లీ**


భారత టాప్ చెస్ ప్లేయర్, గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి చరిత్ర సృష్టించింది. ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్–2025 ఫైనల్ చేరిన రెండో భారత క్రీడాకారిణిగా నిలిచింది. గురువారం జరిగిన సెమీఫైనల్ టైబ్రేక్ మ్యాచ్‌లో చైనాకు చెందిన లీ టింగ్జీపై విజయం సాధించింది. తొలి రెండు క్లాసికల్ గేమ్స్ డ్రాగా ముగియడంతో విజేతను నిర్ణయించేందుకు టైబ్రేక్ అవసరమైంది. టైబ్రేక్స్‌లో హంపి విజృంభించింది. ఇప్పటికే 19 ఏళ్ల భారత ప్లేయర్ దివ్య దేశ్‌ముఖ్ ఫైనల్‌కు చేరింది. దీంతో జులై 26–28 తేదీల్లో జరగనున్న ఫైనల్ మ్యాచ్ కోనేరు హంపి–దివ్య దేశ్‌ముఖ్‌ల మధ్య 'ఆల్ ఇండియన్' పోరుగా మారింది. భారత్ ఖాతాలో తొలిసారి ఫిడే మహిళల చెస్ వరల్డ్‌కప్ ట్రోఫీ చేరడం ఖాయమైంది.

టై బ్రేక్స్‌ను వేగవంతమైన ఫార్మాట్‌లో( ర్యాపిడ్, బ్లిట్జ్) టై బ్రేక్స్ మ్యాచ్‌లు నిర్వహించగా.. ఇద్దరు ఆటగాళ్లు హోరాహోరీగా తలపడ్డారు. ఈ ఫార్మాట్స్‌లో ఆటగాళ్లకు చాలా తక్కువ సమయం ఉంటుంది. ఈ గేమ్స్.. ఆటగాళ్ల వేగవంతమైన ఆలోచన సామర్థ్యంతో పాటు ఒత్తిడిని ఎదుర్కొనే నైపుణ్యానికి పరీక్షగా నిలుస్తాయి.

ముందుగా 10 ప్లస్ 10 రాపిడ్ గేమ్స్‌తో టై బ్రేక్ మొదలైంది. ఈ మ్యాచ్‌లను కోనేరు హంపి, లీ టింగ్జీ డ్రా చేసుకున్నారు. అనంతరం 5౦3 ఫార్మాట్‌లో ఆడిన రెండో టై బ్రేక్‌లో తెల్ల పావులతో ఆడిన లీ టింగ్జీ విజయం సాధించింది. దాంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. తప్పక గెలవాల్సిన రెండో గేమ్‌లో కోనేరు హంపి విజయం సాధించి స్కోర్లను సమం చేశారు. దాంతో ఫలితం తేల్చడానికి బ్లిట్జ్ గేమ్స్ (3 ప్లస్ 2 ఫార్మాట్) ఆడించాల్సి వచ్చింది. ఈ బ్లిట్జ్ గేమ్‌లో కోనేరు హంపి పైచేయి సాధించింది. 3 ప్లస్ 2 బ్లిట్జ్ ప్రారంభ గేమ్.. 44వ ఎత్తు లీ టింగ్జీ చేసిన తప్పిదాన్ని కోనేరు హంపి సద్వినియోగం చేసుకుంది. రాణి ఆధిక్యాన్ని సాధించి విజయాన్ని సొంతం చేసుకుంది. రెండో బ్లిట్జ్ గేమ్‌లోనూ హంపి తన ఆధిక్యాన్ని నిలబెట్టుకొని విజేతగా నిలిచింది. ఈ విజయంతో వచ్చే ఏడాది జరిగే మహిళల క్యాండిడేట్స్ టోర్నీకి కోనేరు హంపితో పాటు దివ్య దేశ్‌ముఖ్‌లు అర్హత సాధించారు. జులై 26–28 వరకు జరిగే ఫైనల్లో భారత్‌కే చెందిన దివ్య దేశ్‌ముఖ్‌తో కోనేరు హంపి తలపడనుంది.

## డబ్లూడబ్ల్యూఈ లెజండరీ రెజ్లర్ హల్క్ హొగన్ మృతి..

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



లెజెండరీ అమెరికన్ రెజ్లర్ హల్క్ హొగన్ మరణించాడు. ఆయన కార్డియక్ అరెస్ట్‌తో కన్నుమూసినట్లు వైద్యులు తెలిపారు. ఆగస్టు 11, 1953న జార్జియాలోని అగస్టాలో జన్మించిన హల్క్.. రెజ్లింగ్ క్రీడకే ప్రత్యేక వన్నె తెచ్చారు. డబ్ల్యూడబ్ల్యూఈకి ప్రజాదరణ తీసుకురావడంలో హల్క్ తీవ్రంగా కృషి చేశారు. 1983లో వరల్డ్ రెజ్లింగ్ ఫెడరేషన్‌లో చేరడంతో ఆయన కెరీర్ ఒక గొప్ప టర్న్ తీసుకుంది. ఆండ్రీ ది జెయింట్, మాకో మ్యాన్ రాండీ సావేజ్, అల్టిమేట్ వారియర్ వంటి గొప్ప రెజ్లర్‌లతో చారిత్రాత్మక మ్యాచ్‌లలో పోటపడ్డారు. హల్క్ ఆరు సార్లు డబ్ల్యూడబ్ల్యూఈ ఛాంపియన్‌గా నిలిచారు. హల్క్ హ్యాండిల్ బార్ మీసాలతోనూ సూపర్ క్రేజ్ తెచ్చుకున్నారు.

హొగన్ 2005లో డబ్ల్యూడబ్ల్యూఈ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్నారు. 1984లో మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ది ఐరన్ షేక్‌ను ఓడించడం ద్వారా హొగన్ తన మొదటి డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నాడు. ఈ విజయంతో హల్క్‌మానియా" ప్రారంభమైంది. రెజ్లింగ్‌తో పాటు హొగన్ పలు సినిమాల్లో నటించారు. నో హోల్డ్స్ బారెడ్, సబర్బన్ కమాండో, మిస్టర్ నాన్నీ వంటి సినిమాల్లో నటించారు. టీవీ షోలలోనూ పాల్గొన్నాడు. హల్క్‌కు ఇండియాలోనూ చాలా మంది ఫ్యాన్స్ ఉన్నారు. హల్క్ మరణవార్తను డబ్ల్యూడబ్ల్యూఈ ధ్రువీకరించింది. డబ్ల్యూడబ్ల్యూఈ హాల్ ఆఫ్ ఫేమ్‌లో ఒకడైన లెజెండరీ రెజ్లర్‌ను కోల్పోయామని సంతాపం తెలియజేస్తూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది.

## హరిహర వీరమల్లు సినిమా చూసిన 'పరదా' మహిళలు

- ప్రమోషన్ షురూ చేసిన 'పరదా' టీం

**బలగం టీవీ, హైదరాబాద్**



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ప్రధాన పాత్రలో నటించిన 'హరిహర వీరమల్లు దేశవ్యాప్తంగా విడుదలైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ఐమ్యాక్స్ మల్టీప్లెక్స్‌లో ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ముఖం కనిపించకుండా ఎర్రటి చీరలతో కప్పుకుని వచ్చిన కొందరు మహిళలు హరిహర వీరమల్లు సినిమా వీక్షించడంతో ప్రేక్షకుల దృష్టి మొత్తం వారిపై నిలిచింది. వాస్తవానికి ఇది ఒక కొత్త సినిమా ప్రమోషన్ భాగంగా జరిగింది. దర్శకుడు ప్రవీణ్ కంద్రేగుల, నటి అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'పరదా' త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఆగస్టు 22న ఈ చిత్రం విడుదల కానుంది. 'పరదా' సినిమాకు ప్రచారం కల్పించే ఉద్దేశంతో... చిత్రబృందం ఎర్రటి చీరలు ధరించి, ముఖాన్ని చీరచెంగులతో కప్పుకున్న మహిళలను థియేటర్‌కు పంపింది. ఇదంతా ఒక డిజైన్ చేసిన ప్రోమో యాక్ట్ అయినా... ఇది అక్కడికి వచ్చిన జనాల్లో పెద్ద దృష్టి ఆకర్షించింది.

# ఇంగ్లండ్ దూకుడు

- రెండో రోజు ముగిసే సమయానికి ఇంగ్లండ్ 225/2
- డకెట్ 94, క్రాలీ 86
- భారత్ 358 ఆలౌట్



**బలగం టీవీ, మాంచెస్టర్**

మాంచెస్టర్ టెస్టులో ఇంగ్లండ్ దూకుడుగా ఆడుతోంది. నాలుగో టెస్టు రెండో రోజు ఆటలో పూర్తిగా ఆధిపత్యం చెలాయించారు. డకెట్ (94), క్రాలీ (84) ధనాధన్ ఆటతో భారత్ బౌలర్లకు చుక్కలు చూపించారు.ఓపెనర్లు డకెట్, క్రాలీ తొలి వికెట్‌కు 166 పరుగుల భారీ భాగస్వామ్యం అందించడంతో ఇంగ్లండ్ జట్టు 46 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. ప్రస్తుతం ఒలీ పోప్ (20), జో రూట్ (11) క్రీజులో ఉన్నారు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో చేసిన 358 పరుగులకు ఇంకా 133 పరుగులు వెనుకబడి ఉంది.

ఇంగ్లండ్ బ్యాటర్లు మొదటి నుంచి దూకుడుగా ఆడుతూ భారత బౌలింగ్‌ను తేలికగా ఎదుర్కొన్నారు. ఓవర్‌కు ఐదు రన్లకు పైగా స్కోరింగ్ రేట్‌ను కొనసాగించారు. టి విరామానికి 77 పరుగులు చేసిన ఇంగ్లండ్, అనంతరం జోరుగా పరుగులు గడించింది. అయితే డ్రింక్స్ అనంతరం జడేజా వేసిన ఓవర్లో క్రాలీ ఔటవ్వగా, డకెట్‌ను అన్షుల్ బౌలింగ్‌లో ధ్రువ్ జురేల్ క్యాచ్ చేసి పెవిలియన్‌కు పంపాడు.

అంతకుముందు టీమ్‌ఇండియా ఓవర్‌నైట్ స్కోరు 264/4 నుంచి మరో 94 పరుగులు మాత్రమే జోడించి 358 పరుగులకు ఆలౌట్ అయింది. శార్దూల్ (41), వాషింగ్టన్ (27), రిషభ్ పంత్ (54) లేయర్ ఆర్డర్‌లో కాస్త పోరాడినా, స్టోక్స్ (5/72), ఆర్చర్ (3/73) బౌలింగ్‌కు భారత్ తలవంచింది.

**సంక్షిప్త స్కోర్లు:**

భారత్ మొదటి ఇన్నింగ్స్: 358 ఆలౌట్ (సాయి 61, జైస్వాల్ 58, స్టోక్స్ 5/72)

ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్: 225/2 –46 ఓవర్లలో (డకెట్ 94, క్రాలీ 84, జడేజా 1/37)

## పీవీ సింధుకు ఉన్నతి హుడా షాక్





**బలగం టీవీ, హైదరాబాద్**

భారత బ్యాడ్మింటన్ యువ సంచలనం ఉన్నతి హుడా తన కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శనను నమోదుచేసింది. చైనా ఓపెన్‌లో 17 ఏండ్ల ఈ అమ్మాయి.. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత, స్టార్ షట్లర్ పీవీ సింధుకు షాకిచ్చింది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఉన్నతి.. 21–16, 19–21, 21–13తో తన (35) కంటే మెరుగైన ర్యాంకు కలిగిన సింధు (15)ను ఓడించి క్వార్టర్స్ చేరింది. ఇక ఈ విజయంతో ఉన్నతి.. చైనా ఓపెన్‌లో క్వార్టర్స్ చేరిన అత్యంత పిన్న వయస్కురాలిగా రికార్డులకెక్కింది. పురుషుల డబుల్స్ విషయానికొస్తే సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ద్వయం 21–19, 21–19తో మౌలానా–కర్నండో (ఇండోనేషియా)ను ఓడించి క్వార్టర్స్ చేరారు. పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్.. 21–18, 15–21, 8–21తో ఆరో సీడ్ చైనీస్ తైపీ షట్లర్ చౌ టైన్ చెన్ చేతిలో పోరాడి ఓడాడు.

## పంచాయితీలు చేసి సినిమా విడుదల చేయాల్సి వచ్చింది

- హరిహర వీరమల్లు సక్సెస్ మీట్‌లో పవన్ కల్యాణ్ భావోద్వేగం

**బలగం టీవీ, హైదరాబాద్**



టాలీవుడ్ పవర్ స్టార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన భారీ చారిత్రక చిత్రం 'హరిహర వీరమల్లు' సుదీర్ఘ నిరీక్షణకు తెరదించి బుధవారం (జులై 24) న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌కు పవన్ కల్యాణ్ హాజరై మాట్లాడారు. సినిమా షూటింగ్, విడుదలపై ఎదురైన సమస్యల్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు.

"జీవితంలో నాకు ఏదీ సులభంగా దక్కలేదు... ఈ సినిమా కూడా అంతే. ఉప ముఖ్యమంత్రి అయినా సినిమా విడుదల సులభం అనుకునే పరిస్థితి లేదు. వారం రోజులుగా నిద్రపోలేకపోయాను. ప్రజల కోసం ఉన్న బాధ్యతలూ సినిమాపై ప్రేమ కూడా రెండూ సమతుల్యంలో కొనసాగించాల్సి వచ్చింది. "నేను ఏపీ ప్రభుత్వంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రిని... పంచాయితీలు చేసి సినిమా విడుదల చేయాల్సి వచ్చింది. జీవితంలో నాకు ఏదీ అంత సులభంగా దక్కలేదు... ఈ సినిమా కూడా అంతే. ఉప ముఖ్యమంత్రిని కదా... సినిమా విడుదల ఈజీ అనుకున్నాను... కానీ వారం రోజులు నిద్రపోలేకపోయాను. ఈ రెండ్రోజుల్లో నేను మాట్లాడిన మాటలు, నా 29 ఏళ్ల సినీ ప్రయాణంలో 10 శాతం కూడా మాట్లాడి ఉండను. ఇవాళ హరిహర వీరమల్లు సక్సెస్ మీట్ కు రావడంలో ఆలస్యమైంది. అమరావతిలో ఏపీ క్యాబినెట్ మీటింగ్ లో పాల్గొనడం వల్ల లేటైంది. అందుకు నన్ను క్షమించాలి. గతంలో నేను ఎప్పుడూ ఇలా సక్సెస్ మీట్లలో పాల్గొనలేదు. ఇదే తొలిసారి" అని పవన్ కల్యాణ్ వివరించారు.

'నేను ఒక సినిమా చేస్తే ఆ సినిమా మిమ్మల్ని భయపెడుతుందంటే, అది నా స్థాయి. పీరియడ్ ఫిల్మ్ ఇంతకు ముందు చేయలేదు. ఇదో కొత్త అనుభవం. హిస్టరీలో మనం మొఘలుల గొప్పతనం మాత్రమే చదువుకున్నాం. వాళ్లు చెత్త పనులు కూడా చేశారు. ఔరంగజేబు లాంటి వాళ్లు దారుణాలకు తెగబడ్డారు. వాటన్నింటినీ వైట్ వాష్ చేసి మనకు వినిపించారు గత పాలకులు. హిందువులపై వారు విధించిన జిజియా పన్ను గురించి లైట్‌గా టచ్ చేసి వదిలేశారు.మన శ్రీకృష్ణదేవరాయల్ని, రాణీరుద్రమదేవిని, కాకతీయ, పల్లవ చరిత్రలను మన గత పాలకులు చిన్నచూపు చూశారు అనిపించింది. అందుకే వాటన్నింటి గురించి ఈ సినిమాలో చర్చించేందుకు ప్రయత్నించాం. అందుకని ఇది హిందూ, ముస్లింల మధ్య జరిగే యుద్ధం మాత్రం కాదు. ఒక అరాచకంపై, మత విద్వేషంపై జరిగిన యుద్ధం. ఈ సినిమా పార్ట్ 2 కూడా 30శాతం పూర్తయింది. ఈ సినిమా విడుదలకు సహకరించిన మైత్రీ మూవీమేకర్స్‌కు థ్యాంక్స్ చెప్పుకుంటున్నా. టెక్నికల్‌గా కొన్ని సమస్యలుండొచ్చు. దాన్ని సెకండాఫ్‌లో సరిచేసుకుంటాం' అని అన్నారు.

'హరిహర వీరమల్లు' సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించగా, ఈ చిత్రం విడుదలకు ముందు పవన్ కల్యాణ్ రాజకీయ బాధ్యతల వల్ల రిలీజ్ ఆలస్యం జరిగింది. కానీ విడుదలైన వెంటనే అభిమానుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.